వన మహోత్సవానికి ప్రణాళిక సిద్ధం !


పజ్జూరు గ్రామంలోని నర్సరీ


గడ్డికొండారంలో మొక్కలు నాటుతున్న కూలీలు

- తిప్పర్తి మండలంలో 26 నర్సరీల్లో ముమ్మరంగా పనులు
- లక్షా 80వేల మొక్కలు నాటడమే లక్ష్యం
- వానాకాలం సీజన్‌లో పంపిణీ చేసేలా అధికారుల కసరత్తు

తిప్పర్తి : రాష్ట్రంలో అడవుల శాతం పెంచడానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2015లో హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించింది. చెట్లు తక్కువగా ఉండడం వల్ల రాష్ట్రంలో వర్షాల శాతం తక్కువగా ఉండడంతో ప్రతి సంవత్సరం విధిగా మొక్కలు నాటేలా హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించి మానవాళికి ఆక్సిజన్ అందించేందుకు ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. హరితహారంలో భాగంగా ప్రతి సంవత్సరం మండలానికి సుమారు లక్షా యాభైవేల మొక్కలను పెంచి ఖాళీ ప్రదేశాల్లో, రోడ్ల వెంట మొక్కలను నాటించి వాటిని సంరక్షించే చర్యలు చేపట్టింది.

వన మహోత్సవంగా మార్పు..

బీఆర్‌ఎస్ పాలనలో హరితహారం పేరుతో ప్రతి సంవత్సరం నర్సరీల ద్వారా మొక్కలను పెంచి వాటిని గ్రామాల్లోని వివిధ ప్రదేశాల్లో నాటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హరితహారం కార్యక్రమాన్ని వన మహోత్సవంగా పేరు మార్చింది. 2025 సంవత్సరానికిగాను రానున్న వర్షాకాలానికి జూన్-జూలై మాసాల్లో మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటి వరకు 10 విడతలు పూర్తి కాగా వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 11వ విడత కోసం తిప్పర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. తిప్పర్తి మండల వ్యాప్తంగా 26 గ్రామ పంచాయతీలకుగాను లక్షా 80వేల మొక్కలు పెంచడానికి ఉపాధిహామీ పథకం ద్వారా నర్సరీల్లో పనులు ప్రారంభించారు. అన్ని గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో పాలిథిన్ బ్యాగుల్లో మట్టి నింపి గింజలు నాటారు. మండలవ్యాప్తంగా ఇప్పటి వరకు లక్ష గింజలు బ్యాగుల్లో నాటారు. ఇంకా 80వేల మొక్కల కోసం పనులు ముమ్మరంగా చేపట్టారు. గత సంవత్సరం నాటి చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తగా మొక్కలు నాటనున్నారు. అదే విధంగా ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో, రోడ్ల వెంట, ఇతర ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటనున్నారు.

పనులు ప్రారంభించాం



తిప్పర్తి మండలవ్యాప్తంగా వన మహోత్సవంలో భాగంగా వచ్చే వర్షాకాలం సీజన్‌లో మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించాం. 26 గ్రామ పంచాయతీల్లో అన్ని గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేశాం. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి చేశాం. గింజలు కూడా నాటించాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసి వచ్చే వానాకాలం సీజన్ వరకు మొక్కలు అందిస్తాం.

–వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ, తిప్పర్తి

నర్సరీల్లో పలు రకాల మొక్కలు

ప్రస్తుతం తిప్పర్తి మండల వ్యాప్తంగా వచ్చే వానాకాలం సీజన్‌లో నాటేందుకు వివిధ రకాల మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. ఈత, వెదురు, టేకు, హోమ్ సైడ్ మొక్కలు, పండ్లు, పూల మొక్కలు పెంచుతున్నారు. ప్రతి ఇంటికి ఆరు పండ్లు, పూల మొక్కలు పంపిణీ చేయనున్నారు.

కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న మోదీ

- సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

చండూరు (గట్టుప్పల్): కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న మోదీ విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి కోరారు. గురువారం మునుగోడు నియోజక వర్గ స్థాయి సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం గట్టుప్పల్ మండల కేంద్రంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ కాకులను కొట్టి గద్దలకు వేసే విధంగా ఉందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు డీజిల్ పెట్రోల్, గ్యాస్ , నిత్యవసర వస్తువుల ధరలు పెంచి పేదల పైన ఆర్థిక భారాలు మోపారన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, నాంపల్లి చంద్రమౌళి, సాగర్ల మల్లేశం, ఏర్పుల యాదయ్య, జేరిపోతుల ధనంజయ, ముత్యాలు, కట్ట లింగస్వామి, లక్ష్మి, కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, కకునూరి నగేష్, పెద్దగోని నరసింహ, శ్రీనివాస్ శ్రీశైలం, ఖమ్మం రాములు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

కల్లు గీత పారిశ్రామిక సంఘం ఓటర్ల జాబితా విడుదల

- వెలువడిన ఓటర్ల జాబితా

నకిరేకల్: నకిరేకల్ కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. సంఘ పాలకవర్గం గత సంవత్సరం అక్టోబర్ 25తో కాలపరిమితి ముగియగా.. నూతన పాలకవర్గ ఎన్నిక కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈమేరకు నూతన ఓటర్ల జాబితాను ఆశాఖ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్‌రెడ్డి గురువారం ప్రకటించారు. సంఘం పరిధిలో 780 మంది ఓటర్లు ఉండగా.. 757 మంది పురుషులు, 23 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. జాబితాలో అభ్యంతరాలపై మూడు రోజుల్లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి నల్లగొండ వారికి తెలపాలని ఆశాఖ అధికారి పేర్కొన్నారు. ఈనెల 10న ఓటర్ల జాబితాలో వచ్చిన ఆక్షేపణలను పరిశీలించి తుది జాబితాను రాష్ట్ర సహకార సంఘం ఎన్నికల కమిషన్‌కు సమర్పించనున్నారు. వారి ఆదేశాల మేరకు త్వరలో నకిరేకల్ కల్లు గీత పారిశ్రామిక సంఘ పాలకవర్గం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనున్నారు.

సమతుల ఆహారంపై విద్యార్థులకు అవగాహన

నార్కట్‌పల్లి: మండలంలోని బి వెల్లంల హైస్కూల్‌లో గురువారం ఇన్‌స్టేల్ ఫర్ గోల్డెన్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సమతుల ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నర్సింహ, డాక్టర్ విజయ్‌కుమార్, విశ్రాంతి శ్రీరాములు, సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ సురేశ్‌బాబు, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


మంత్రదండం కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రచించిన మంత్రదండం కథల సంపుటిని గురువారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయన ఆవిష్కరించారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారిచే కథల సంపుటిని రూపొందింపజేసిన ప్రముఖ రచయిత్రి, ఉపాధ్యాయురాలు డాక్టర్ ఉప్పల పద్మను అభినందించారు. కార్యక్రమంలో ఓయూ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ అధ్యాపకుడు డాక్టర్ సాదం ఐలయ్య, ఎస్‌సీఈఆర్‌టీ ఫ్యాకల్టీ పఠాన్ ఎఫ్. ఖాన్, పల్లెర సురేందర్, చిలుకూరి మధు, నాగరాజు పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది


నల్లగొండలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ శివరాంరెడ్డి


నకిరేకల్‌లో కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్‌ఐ లచ్చిరెడ్డి

రామగిరి(నల్లగొండ): యువతలో క్రీడలతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. మిషన్ పరివర్తన్ యువతేజం కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి కబడ్డీ పోటీలు గురువారం చర్లపల్లి విపస్య పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచడానికి పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సీఐ రాఘవరావు, ఎస్సై సైదాబాబు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

నల్లగొండ: క్రీడలతో విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతోపాటు, మానసిక ఉల్లాసం కలుగుతుందని నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి జూనియర్ కళాశాల మైదానంలో మిషన్ పరివర్తన్- యువతేజం కార్యక్రమంలో భాగంగా కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్‌ఐ శంకర్, ఉపాధ్యాయులు గిరిబాబు, బాలు, బాయ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ యూసుఫ్ ఉద్దీన్, ఖలీం, పోలీస్ సిబ్బంది శ్రీకాంత్, షకీల్, కృష్ణారెడ్డి, అఖిల్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

నకిరేకల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నకిరేకల్ ఎస్‌ఐ లచ్చిరెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆదేశాల మేరకు మిషన్ పరివర్తన్ యువతేజం కార్యక్రమంలో భాగంగా గురువారం నకిరేకల్‌లోని ఏవీఎం విద్యాసంస్థల ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరకదారుఢ్యానికి దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, ప్రిన్సిపాల్ కందాల స్వప్నారెడ్డి, పోలీస్ సిబ్బంది మధుకర్, వెంకటేశ్వర్లు, జనార్దన్, పీడీలు రాపోలు శైలజ, విద్యాసాగర్‌రెడ్డి, నిమ్మల శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

మునుగోడు: ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం మునుగోడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను చండూరు సీఐ వెంకటయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటయ్య, కానిస్టేబుల్స్ రమణారెడ్డి, వీరాంజనేయులు, నర్సింహ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

నార్కట్‌పల్లి: యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని హైస్కూల్‌లో మిషన్ పరివర్తన్ యువ తేజం కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి కబడ్డీ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఎస్‌ఐ క్రాంతికుమార్, ఎంఈఓ నరసింహ, హెచ్‌ఎం రాములు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

కట్టంగూర్: కట్టంగూర్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడాపోటీలను ఎంఈఓ అంజయ్య, ఎస్‌ఐ రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గెలుపొందిన కట్టంగూర్ బాలికల టీంకు ప్రథమ బహుమతి రూ.5116, మునుకుంట్ల ఉన్నత పాఠశాల బాలుర టీంకు ద్వితీయ బహుమతి రూ.2500, దుగినవెల్లి ఉన్నత పాఠశాల బాలికల టీంకు తృతీయ బహుమతి కింద రూ.1500 ఎస్‌ఐ రవీందర్ అందజేశారు. కార్యక్రమంలో పీడీలు విజయ్‌కుమార్, పుల్లయ్య, మాణిక్యం, పోలీసు సిబ్బంది సతీష్, దుర్గాప్రసాద్, శంకర్ ఉన్నారు.

క్రీడలు పోటీతత్వాన్ని అలవర్చుతాయి.

చిట్యాల: క్రీడలు పోటీతత్వాన్ని అలవర్చుతాయని డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. చిట్యాలలోని లోయోలా టెక్నో స్కూల్‌లో గురువారం నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ధర్మా, ఎంఈఓ సైదానాయక్ పాల్గొన్నారు.

క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందుతుంది

శాలిగౌరారం: క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందుతుందని శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మండల స్థాయి కబడ్డీ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం యువకులతో కలిసి కబడ్డీ ఆడారు. 10 జట్లు పాల్గొనగా ప్రథమ బహుమతి వల్లాల మోడల్‌స్కూల్‌కు చెందిన ఇంటర్ గ్రూపు- ఏ జట్టు గెలుచుకోగా ద్వితీయ బహుమతి శాలిగౌరారం గ్రామానికి చెందిన నేతాజీ యూత్ క్లబ్ జట్టు, తృతీయ బహుమతి వల్లాల మోడల్ స్కూల్ ఇంటర్ గ్రూపు- బీ జట్టు గెలుపొందాయి. కార్యక్రమంలో ఎస్‌ఐ సైదులు, ఏఎస్‌ఐ వెంకటయ్య, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, నజీరుద్దీన్, జెడ్పీహెచ్‌ఎస్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కనగల్: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని చండూరు సీఐ వెంకటయ్య అన్నారు. గురువారం కనగల్‌లో కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కబడ్డీ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విష్ణుమూర్తి, ఏఎస్‌ఐ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం

నల్లగొండ టౌన్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలపడం హర్షణీయమని మాదిగ సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పెరిక కరం జయ్‌రాజు, జిల్లా చైర్మన్ కత్తుల జగన్‌కుమార్ అన్నారు. గురువారం నల్లగొండలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మాదిగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న మాదిగలకు, వెన్నుదన్నుగా నిలిచిన బొర్ర సుధాకర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. 33 లక్షల మందికిపైగా ఉన్న మాదిగలకు 11శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం 9 శాతం రిజర్వేషన్లు కల్పించి మాదిగలకు తీరని అన్యాయం చేశారన్నారు. త్వరలో జరుగనున్న మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు కత్తుల షణ్ముఖకుమార్, మహిళా నాయకురాలు పెరిక సంహితారాణి, కత్తుల తులసీదాస్, పెరిక అంజయ్య, నాగుల నర్సింహ, బుర్రి స్వామి, ఇరిగి ప్రసాద్, హరిప్రసాద్, మాతంగి లింగస్వామి, మహేష్, పరమేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కత్తుల జగన్‌కుమార్

సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం

నల్లగొండ: ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కేబినేట్ ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిత్రపటాలకు గురువారం నల్లగొండలోని క్లాక్‌టవర్‌లో కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నల్లగొండ మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కట్టంగూర్: ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కట్టంగూడర్ మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ యూత్ ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారు కృష్ణ, మర్రి రాజరత్నం, మేడి విజయ్, ఊట్కూరి శ్రీను, మైనం అంబేద్కర్, వెంకన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.


సీఎం, మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు

చిట్యాల: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం లభించడంతో చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని ఆ గ్రామ దళిత యువకులు గురువారం సన్మానించారు. అదేవిధంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జనపాల శ్రీను, పట్ల జనార్దన్, మేడి రమేష్, జనపాల రాము, మేడి రాజేష్, పసుకుల స్వామి, కురుపటి నాగరాజు, చంటి, అరవింద్ పాల్గొన్నారు.

మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ల పోస్టులు పెంచాలి


డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలు

నల్లగొండ టౌన్: మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ పరీక్షకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌ను సవరించి పోస్టుల సంఖ్య పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండలోని డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట రెండవ ఏఎన్‌ఎంలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రెండవ ఏఎన్‌ఎంలకు రెగ్యులర్ రూ.10 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తోపాటు నూరు శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంహెచ్ఓ కార్యాలయంలో వినతి అందజేశారు. ధర్నాలో కేఎస్.రెడ్డి, పోలె రత్నకుమారి, గీతారాణి, మాధురి, చిత్రం సరిత, రుక్సానా, అలివేలు మంగ, సులోచన, అన్నమ్మ, ధనలక్ష్మి, హరిత, శ్రీలత, భాగ్యలక్ష్మి, సువర్ణ, రేబాక, పుష్ప, పద్మావతి, రూప, విజయలక్ష్మి, వెంకటమ్మ, హైమావతి, సునీత, చంద్రకళ, నాగమణి పాల్గొన్నారు.

విలేజ్ లేబర్ ఆఫీసర్ నియామకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

నల్లగొండ టౌన్: ప్రభుత్వం నూతనంగా చేపట్టనున్న విలేజ్ లేబర్ ఆఫీసర్ నియామకాల్లో 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల వారసులకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం అన్నారు. గురువారం వీఆర్‌ఏ జేఏసీ ఆధ్వర్యంలో నల్లగొండలోని సుభాష్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలవడానికి వెళ్లిన వీఆర్‌ఏలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దండంపల్లి సత్తయ్య, పోలె సత్యనారాయణ, నగేష్, రవి, వెంకన్న, అంజయ్య, సయ్యద్, సుధాకర్, మట్టయ్య, రాజు, వెంకటమ్మ, యమున, రంజాన్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

రెండు ఇళ్లలో చోరీ

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని సంతోష్‌నగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రెండు ఇళ్లలో చోరీ చేశారు. బాధితుల వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్‌లో నివాసం ఉండే గురిజ ధనమ్మ ప్రైవేట్ స్కూల్‌లో ఆయాగా పనిచేస్తోంది. ఆమె ఇంట్లో లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఇంటి తాళాన్ని పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న వన్‌గ్రామ్ ఆభరణాలను బంగారు ఆభరణాలు అనుకుని చోరీ చేశారు. మధ్యాహ్న సమయంలో భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లగా ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. అదేవిధంగా సంతోష్‌నగర్‌లో మిర్యాల గోపాల్ తన షాపు వద్ద ఉండగా ఆయన భార్య యశోద ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి నల్లగొండకు వెళ్లింది. మధ్యాహ్న సమయంలో భోజనం చేసేందుకుగాను గోపాల్ ఇంటికి వెళ్లగా తాళం పగులగొట్టి ఉండటంతో పాటు ఇంట్లోని బీరువాలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. అందులోని రూ.40వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. దీంతో గోపాల్ చిట్యాల పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు.

యువతి అదృశ్యం

తిప్పర్తి: మండలంలోని గోదావరిగూడెంలో గురువారం యువతి అదృశ్యమైంది. తిప్పర్తి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యువతి గత రెండు సంవత్సరాలుగా కట్టుమిషన్ కుడుతూ ఇంటివద్దే ఉంటుంది. ఈనెల 5న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం తల్లిదండ్రులు రాగా కుమార్తె ఇంట్లో లేకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లేకపోవడంతో గురువారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

మునుగోడు: తప్పిపోయిన బాలుడి ఆచూకీని పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. చండూరు సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు పట్టణానికి చెందిన వరంతంగి లక్ష్మిసురేష్ దంపతుల కుమారుడు కార్తీక్ బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా.. గురువారం మధ్యాహ్నం సమయంలో ఆ ఇంటి పక్కనే గల మరో ఇంటి వద్ద ఉండడాన్ని గుర్తించారు. దీంతో ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

ముగిసిన బ్యాగ్ లెస్ డే కార్యక్రమం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ కేంద్రీయ విద్యాలయంలో చేపట్టిన బ్యాగ్ లెస్ డే కార్యక్రమాలు గురువారం ముగిశాయి. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. జనవరి 27న నుంచి ప్రతిరోజు వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో సుమారు 210 మంది పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీరాములు, కళాశాల కో ఆర్డినేటర్ రవికుమార్, శ్రీనయ్య, మనీషా, సుష్మా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

కనగల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖమ్మంపాటి శంకర్, ఆకారపు నరేష్ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ కనగల్ మండల 12వ మహాసభను గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో అక్రమ్, కిరణ్ హరిచందన్, కుమార్, అభిలాష్, నాని, సుధాకర్, రాకేష్, సింధుజ, సోని, మణి, ప్రశాంత్, హరీష్ పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడిగా బయ్యన్న

చిట్యాల: పట్టణానికి చెందిన సీనియర్ విలేకరి యేళ్ల బయ్యన్న టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ప్రెస్‌క్లబ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గురువారం మిర్యాలగూడలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు.

రామాలయం హుండీ ఆదాయం రూ.3లక్షలు

రామగిరి(నల్లగొండ): రామగిరిలోని రామాలయం ఆలయ హుండీని గురువారం లెక్కించారు. హుండీ ఆదాయం రూ.3,06,830 వచ్చినట్లు ఆలయ ఈఓ జయరామయ్య తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి

నల్లగొండ: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రెడ్డి అన్నారు. గురువారం ఆయన నల్లగొండలోని ప్రభుత్వ నాగార్జున డిగ్రీ కళాశాల, ప్రగతి, గౌతమి జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల పాఠశాల, బాలుర పాఠశాల, జిల్లా ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం, జిల్లా పారిశ్రామిక శిక్షణా కేంద్రం, ఉర్దూ పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని కోరారు.

నీటి వినియోగంపై అవగాహన

మర్రిగూడ: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వాడుకోవాలని నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమం గురువారం మర్రిగూడ మండలంలోని వెంకేపల్లి, కమ్మగూడ గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నీటిని పొదుపుగా వాడుకుంటేనే భూగర్భజలాలు కాపాడుకోవడంతోపాటు రాబోయే తరాలకు సురక్షిత నీటిని అందించినవారమవుతామని తెలిపారు.

ఎంపీటీసీ స్థానం ఏర్పాటుపై హర్షం

మర్రిగూడ: మండలంలోని సరంపేట గ్రామాన్ని నూతన ఎంపీటీసీ స్థానంగా ఏర్పాటు చేయడంతో కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు వర్కాల వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీటీసీ స్థానానికి సమీప గ్రామాలైన మేటిచందాపురం, కొట్టాల గ్రామాలను కలపడంతో ఈ గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

క్లుప్తంగా

పంబాల, మన్నె కులాలను ఎస్సీలో చేర్చొద్దు

నకిరేకల్: ఎస్సీ వర్గీకరణలో భాగంగా గ్రూప్- ఏ నుంచి పంబాల, మన్నె కులాలను తొలగించాలని బేడ బుడిగ జంగం రాష్ట్ర నాయకుడు పర్వతం ఆంజనేయులు కోరారు. గురువారం నకిరేకల్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత వెనుకబడిన కులాలతో అభివృద్ధి చెందిన మాల ఉప కులాలైన పంబాల, మన్నె కులాలను చేర్చడం సరికాదన్నారు. సమావేశంలో సంఘం నాయకులు కడమంచి వెంకటయ్య, కళ్లెం నర్సింహ, వానరాశి నారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే మళ్లీ నిర్వహించాలి

కట్టంగూర్: కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వేను మళ్లీ చేపట్టాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ అన్నారు. గురువారం కట్టంగూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వేలో బీసీ సంఖ్య తప్పుల తడకగా చూపించిందని ఆరోపించారు. 98 శాతం కులగణన చేసినప్పటికీ పట్టణప్రాంతాల్లో నామమాత్రంగా జరిగిందన్నారు. హైదరాబాద్‌లో 40శాతం కులగణన జరగలేదన్నారు. బీసీ రిజర్వేషన్లు దెబ్బతీసేందుకు ప్రభుత్వం తప్పుడు లెక్కలు చూపించిందని దుయ్యబట్టారు. సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరిగౌడ్, కార్యదర్శి గిరిగాని భిక్షపతి, తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండాల మల్లేష్ పాల్గొన్నారు.

దక్షిణ మధ్యరైల్వే కార్మిక్ సంఘ్ సభ్యుల హర్షం

నల్లగొండ: విష్ణుపురం నుంచి పగిడిపల్లి రైల్వే లింక్‌ను గుంటూరు డివిజన్ నుంచి సికింద్రాబాద్ డివిజన్ లో కలుపుతున్నట్లు గురువారం రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని దక్షిణ మధ్యరైల్వే కార్మిక్ సంఘ్ నల్లగొండ బ్రాంచ్ సెక్రటరీ కురిమిళ్ల యాదగిరి అన్నారు. గురువారం స్థానికంగా ఆయనతో పాటు సంఘ్ నాయకులు, సభ్యులు సంబరాలు చేసి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ కంకణాల మోహన్ రెడ్డి, గసగాని వెంకట్, విజయ్ భాస్కర్, రాంప్రసాద్, లింగాల వెంకన్న, నిమ్మల వీరస్వామి, బాలకృష్ణ, పవన్ కుమార్, పోగుల రమేష్, శ్రీనివాస్, జగదీష్, సుధాకర్, శ్రీను, సతీష్ అలనాయక్, నాని, సత్యనారాయణ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేస్తున్న తారకరామన్

మర్రిగూడ: ఆడపిల్ల చదువు ఇంటితోపాటు అవనికి వెలుగునిస్తుందని డిప్యూటీ తహసీల్దార్ జూటూరు తారకరామన్ అన్నారు. గురువారం మర్రిగూడ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పీఆర్‌ఆర్ ఫౌండేషన్ అందించిన స్టడీ మెటీరియల్స్‌ను ఆమె అందజేసి మాట్లాడారు. విద్యార్థినులు ఎన్ని కష్టాలు ఎదురైనా ఉన్నత చదువులు అభ్యసించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి పీఆర్‌ఆర్ ఫౌండేషన్ విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

చండూరు (గట్టుప్పల్): గట్టుప్పల్ జెడ్పీ ఉన్నత పాఠశాల 1996- 97 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రూ.30 వేల విలువ గల స్టడీ మెటీరియల్‌ను గురువారం ఎంఈఓ అమృతా దేవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుభాష్, మల్లేష్, రాజు, గణేష్, యాదయ్య, జ్యోతి, మాలతి, వసంత పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కిట్టు సద్వినియోగం చేసుకోవాలి

చండూరు: కాటమయ్య రక్షణ కిట్లను గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని చండూరు ఎక్సైజ్ ఎస్సై స్వాతి, తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న కోరారు. గురువారం చండూరు మండల పరిధిలోని పుల్లెంల, కొండాపురం గ్రామాల లో గీత కార్మికులకు సేఫ్టీ మోకులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సేఫ్టీ మోకుల ట్రైనర్స్ వెంకన్న, వీరయ్య, సత్తయ్య, శంకర్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయ, బీసీ సంక్షేమ శాఖ అధికారి రామారావు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నల్లగొండ టౌన్: డ్రగ్స్ నిర్మూలన కోసం యువతను చైతన్యం చేసేందుకు డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను గురువారం నల్లగొండలోని దొడ్డికొమరయ్య భవన్‌లో సంఘం నాయకులు ఆవిష్కరించారు. డ్రగ్స్ నిర్మూలనకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల నరేష్ తెలిపారు. కార్యక్రమంలో పాలాది కార్తీక్, కార్లపూడి రాము, రఘువరణ్, కిరణ్, మహేష్, సురేష్, మనోహర్, లక్ష్మణ్, శివ పాల్గొన్నారు.